క్లుప్తంగా

అర్హత గల వారికి ప్రమోషన్ ఇవ్వాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలలలో గల ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు, గవర్నమెంట్ టీచర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుపాకుల మురళి కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలలో బదిలీల ద్వారా, కొంతమంది ఉపాధ్యాయుల పదవీ విరమణ వలన సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. వెంటనే ఆ సబ్జెక్టులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటసుబ్బయ్య, ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులు ఉన్నారు.

నైట్ డ్యూటీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పని గంటలు పెంచుతూ మహిళలతో నైట్ డ్యూటీలు చేయించాలని నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు అమలుకు రాష్ట్రానికి ఇచ్చే ఆదేశాలు అమలుపరిచే చర్యలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్మార్గమైన నిర్ణయాలు చేశారన్నారు. నరేంద్ర మోడీ మన్ననలను పొందటానికి కార్పొరేట్లకు, కార్మికుల శ్రమను దోచిపెట్టడానికి కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానంలో 12 గంటల పని విధానాన్ని రుద్దుతూ ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా అందరూ ఏకమై ఆందోళన చేయాలని పిలుపు నిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి. సుబ్బరాయుడు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య భాగ్యం



పిల్లలతో యోగాసనాలు చేయిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: యోగ చేయడం ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్య భాగ్యం కలుగుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో యోగా అధ్యాపకుడు చంద్రమౌళి విద్యార్థులకు సూర్య నమస్కారాలను చేయించి యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజారావు, అధ్యాపకులు సుధాకర్ రెడ్డి, శ్రీరాముల రెడ్డి, సుజాత, పద్మావతి, రోజమ్మ, చంద్రమౌళి, రామసుబ్బయ్య, యోగీశ్వర రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వులలో జరిగిన లోపాలను సరిచేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో టెక్నికల్ సమస్యల వల్ల తలెత్తినటువంటి తప్పిదాలను సరిచేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు ఏబీ. రామకృష్ణంరాజు అన్నారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికోన్నత పాఠశాలలలో మహిళా ఉపాధ్యాయులు అప్లై చేసుకోనప్పుడు మాత్రమే 50 సంవత్సరాలు దాటిన పురుష ఉపాధ్యాయులను బదిలీ చేయవచ్చు అనే నిబంధనను తోసిపుచ్చారన్నారు. మహిళా ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ కూడా పురుష ఉపాధ్యాయులను నియమించారన్నారు. అదేవిధంగా జిల్లాలో బదిలీ ఉత్తర్వులలో జరిగిన తప్పిదాలు సవరించి ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా చూడాలని డీఈఓను కోరారు . కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సోమశేఖర్ ,అన్నమయ్య జిల్లా పెనగలూరు మండల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పర్వదినానికి ఘనంగా ఏర్పాట్లు

– సందడిగా మార్కెట్లు
– పండుగ ఏర్పాట్లలో ముస్లింలు



కడప నగరం బిల్టప్ ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



భక్తుల ప్రార్థనల కోసం ఏర్పాట్లు

కడప కల్చరల్ : పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని ఆహ్వానిస్తూ ముస్లిం వర్గాలు శుక్రవారం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు జిల్లాలో పండుగ నిర్వహణకోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కడప నగరంలోని బిల్టప్ సమీపంలోగల ఈద్గాలో మైనార్టీ సంక్షేమశాఖతోపాటు పోలీసులు, రెవెన్యూ, కార్పొరేషన్ శాఖల అధికారులు ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రార్థనలు నిర్వహించుకునే భక్తులకు ఎండ వల్ల ఇబ్బందులు కలుగకుండా భారీగా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ప్రార్థనలకు హాజరయ్యే భక్తులకు సరిపడ మంచి నీటితోపాటు వజూ చేసుకునేందుకు అవసరమైన నీటి ఏర్పాట్లు చేశారు. పోలీసులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాల మేరకు విశేష ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌ను నియంత్రించేలా ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కడప నగరంలోని పెద్దదర్గా మసీదులో తొలుత పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, ఆ తర్వాత బిల్టప్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇదేకాకుండా దండు ఈద్గాలో కూడా ఎప్పటిలా భారీగా ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. మురాదియా పీఠాధిపతి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే నగర శివార్లలోని ఈద్గాలు, ప్రార్థనాలయాల్లో కూడా బక్రీద్ ప్రార్థనల కోసం దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు.

– బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలు నగరంలోని మార్కెట్లలో సందడిగా కనిపించారు. స్థానిక ప్రధాన మార్కెట్ అయిన వైవీ స్ట్రీట్, బీకేఎం స్ట్రీట్‌లలో కొనుగోళ్లతో కిటకిటలాడాయి. ప్రధానంగా రెడీమేడ్ దుస్తులు, మహిళల అలంకరణ సామాగ్రి, మెహిందీ కోన్‌లు, పాదరక్షలు, వివిధ డిజైన్ల గాజులు తదితర వస్తువుల కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరిగాయి. రాత్రి పొద్దుపోయే వరకు వ్యాపారాలు జరగడంతో సంబంధిత వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. అలాగే నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్దగల షాపింగ్‌మాల్స్‌లో కూడా పెద్ద ఎత్తున ప్రజల కొనుగోళ్లతో కళకళలాడాయి. మొత్తంపై జిల్లా ముస్లింలు పండుగ సందడిలో నిమగ్నమయ్యారు.



బక్రీద్ సందర్భంగా వైవీ స్ట్రీట్‌లో కొనుగోలుదారుల రద్దీ

బక్రీద్ ప్రార్థనలకు వేళాయె

– సిద్ధమైన ఈద్గాలు, మసీదులు

కడప కల్చరల్ : పవిత్ర బక్రీద్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంతోపాటు నగర శివార్లలోని ఈద్గాలు, మసీదులలో శనివారం పండుగ ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా ఈద్గాలు, మసీదుల నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రార్థనల సమయాలను నిర్ణయించారు.ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

మసీదు/ఈద్గా	నమాజ్ వేళలు
అమీనియా ఈద్గా, బిల్టప్	10.30
మురాదియా షామి ఈద్గా, ఆలంఖాన్‌పల్లె	10.45
అస్తానె బొగ్గాదియా మసీదు, బొగ్గాదిగాయ నగర్	6.30
ఏడురోడ్ల మసీదు, ఏడురోడ్ల కూడలి	7.00
షహమీరియా మసీదు, షహమీరియా నగర్	7.00
గుంతబజారు మసీదు, ఎన్టీఆర్ సర్కిల్	9.00
జుమ్మా మసీదు, వైవీ స్ట్రీట్	10.30
బహదూర్‌ఖాన్ మసీదు, బీకేఎం స్ట్రీట్	10.30
అమీనియా మసీదు, పెద్దదర్గా వద్ద	10.15
నకాష్ మసీదు, నకాష్‌వీధి	7.00
హబీబియా మసీదు, బళ్లారిరోడ్డు	8.00
బుర్హనుద్దీన్ మసీదు, చిలకలబావి వీధి	7.00
మదహాఖాన్ మసీదు, సవాయిపుర	9.00
అల్మాస్‌పేట మసీదు, అల్మాస్‌పేట	8.30
హుసేనియా మసీదు, అగాడివీధి	9.30
తిమ్మర్‌జీ మసీదు, సాయిపేట	7.00
అయేషా మసీదు, అయేషానగర్	7.30
రోషన్ మున్వర్ మసీదు, జిల్లా కోర్టు ఎదురుగా	9.30
యాకుబ్‌సాహెబ్ మసీదు, మద్రాసురోడ్డు	11.00
ఇబ్రహీం ఖలీలుల్లా మసీదు, హబీబుల్లావీధి	6.45
హుజ్రా మసీదు, రవీంద్రనగర్	9.00
హౌస్ మసీదు, హౌజ్ స్ట్రీట్	8.00
అంజదియా మసీదు, చాంద్‌ఫిరా గుంబద్ దర్గా	8.00
నూరాని మసీదు, బుచ్చన్‌వీధి	11.00
గౌసే ఆజం మసీదు, గౌస్‌నగర్	7.00
జులేఖాబీ మసీదు, రమేష్ హాలు ఎదురుగా	8.30
అబూ బకర్ సిద్దిఖ్ మసీదు, నెహ్రూనగర్	6.30
రాజాఖాన్‌భాగ్ మసీదు, మోచంపేట	8.30
ఫరూఖ్ మసీదు, గౌస్‌నగర్	8.00
మక్కా మసీదు, రవీంద్రనగర్	10.00
యతీంఖాన మసీదు, మద్రాసురోడ్డు	9.00
హాజిరా మసీదు, దస్తగిర్‌జెండా వీధి	10.00
బ్యాంకు మదీన, జెడ్పీ వద్ద	8.00
మహమ్మదీయ మసీదు, రాజారెడ్డివీధి	9.00
నాగూర్‌బాష దర్గామసీదు, వినాయక సర్కిల్	7.00
ఇనాయత్‌ఖాన్ తాలిం మసీదు, అగాడివీధి	8.30
బుఖారియా మసీదు, రవీంద్రనగర్	6.15
మదార్ మసీదు, తాజ్‌నగర్	8.30
సలీమున్నీసా మసీదు, ట్రంకురోడ్డు	8.30
గఫ్ఫారియా మసీదు, ఏ–1 నగర్	6.30
మజ్జిద్–యే–నవబి, మృత్యుంజయకుంట	10.30
ధన్‌మండి మసీదు, బీకేఎం వీధి	11.00
అక్సా మసీదు, నాగరాజుపేట	8.00
అబ్దుల్ సత్తార్‌మసీదు, బళ్లారిరోడ్డు	7.00
నూర్ మసీదు, మరాఠివీధి	10.30
ఖిజర్‌మసీదు, ఖలీల్‌నగర్	8.30
అన్వరుల్లా మసీదు, ఏ–1 నగర్	7.30
మరియం మసీదు, అల్మాస్‌నగర్	8.30
మహబూబియా మసీదు, రైల్వేస్టేషన్ వద్ద	8.00
మహబూబే ఇలాహి మసీదు, మండిబజారు	6.15
ఏక్‌మినార్ మసీదు, మరాఠివీధి	10.00
అల్ బదర్ మసీదు, శంకరాపురం	10.00
రఫీబియా మసీదు, మోచంపేట	8.30
సాబీర మసీదు, బిస్మిల్లా నగర్	9.00
హంజా మసీదు, నాగరాజుపేట	8.00
మహమ్మదియామసీదు, ప్రకాశ్‌నగర్	9.30
ఆజంబిల్లా మసీదు, రవీంద్రనగర్	10.30
అనస్ మసీదు, మున్సిపల్ మైదానం	10.00
నూరాని మసీదు, భాకరాపేట	10.00
సిద్ధిఖ మసీదు, గరీబ్‌షా వీధి	9.00
మదీన మసీదు, అంగడివీధి	8.00
అబ్జిమియా మసీదు, అగాడివీధి	11.00
అహ్మదియా మసీదు,లోహియానగర్	6.30
అబ్దుల్లా హుసేనీ మసీదు, బ్యాంకు కాలనీ	9.30
అర్షద్‌బీ మసీదు, రవీంద్రనగర్	6.45

కడపలో భారీ బందోబస్తు



బందోబస్తు వివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: కడప నగరంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివారం అన్ని ఈద్గాల వద్ద ప్రార్థనల నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలియజేశారు. ముగ్గురు సీఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీలు, కానిస్టేబుల్, ఇతర సిబ్బంది మొత్తం 120 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆవులు, ఒంటెలు రవాణాపై గట్టి నిఘా వుంచాలన్నారు. పికెటింగ్స్, చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

నేడు శిల్పారామంలో బక్రీద్ ప్రత్యేక కార్యక్రమాలు

కడప కల్చరల్ : బక్రీద్ పండగ పర్వదిన సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం పాలనాధికారి ఎస్.కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నృత్య గురువు విజయశాంతి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీంతోపాటు ఆదివారం పలు ప్రత్యేక కార్యక్రమాల ప్రదర్శన కోసం కళాకారులు శిల్పారామానికి రానున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వినోద కార్యక్రమాలు, ప్రత్యేకంగా స్కిట్లు, ఆహా పేరిట మరికొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

కోడి పందెంరాయుళ్లు అరెస్ట్

కమలాపురం : మండలంలోని గంగవరం గ్రామ సమీపంలోని పెన్నా నది పరివాహక ప్రాంతంలో శుక్రవారం కోడి పందాలు ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. కోడి పందాలు ఆడుతున్న సమాచారం రావడంతో సీఐ ఎస్కే రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ తన సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న 11 మందిని పట్టుకుని అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి 5 పందెం కోడి పుంజులను, రూ.20,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. 11 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. మండలంలో ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

కడప అర్బన్: కడప నగరం జీజీహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్, ఇద్దరు సెక్యూరిటీ గార్డ్స్ ను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ కడప పాత బస్టాండ్ వద్ద సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం రిమ్స్ కు వచ్చినప్పుడు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశామన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని కొందరు కక్షగట్టి ముగ్గురిని తొలగించడం సరైంది కాదన్నారు. తొలగించిన కార్మికులను విధులలోకి తీసుకోవాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు పి వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో పని చేస్తున్న డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ప్రమాదాలకు కారకులైన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఓం శాంతి సంస్థ ప్రతినిధి డ్రైవర్లకు యోగా, ధ్యానం ప్రక్రియలను అభ్యసింపజేశారు. సీఐ జావీద్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. ప్రతి డ్రైవర్ విధులకు వస్తున్న సమయంలో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. అలాగే బస్సును నడిపే సమయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైవర్ల కారణంగా సంస్థకు మంచి పేరు వస్తుందన్న విషయాన్ని ప్రతి డ్రైవర్ గుర్తించాలన్నారు. అనంతరం జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి డ్రైవర్లకు ప్రమాద రహిత డ్రైవింగ్‌పై పలు సూచనలు చేశారు. అలాగే ఇంధన పొదుపు ప్రాధాన్యతను వివరిస్తూ పంచ సూత్రాలను పాటించాలన్నారు. మధ్యాహ్నం డ్రైవర్లకు బ్లాక్ స్పాట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపోలకు చెందిన 20 మంది డ్రైవర్లు, ఆరుగురు హైయిర్ బస్సు డ్రైవర్లు, అధికారులు కృష్ణారెడ్డి, ఎజీ రెడ్డిలు పాల్గొన్నారు.



డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం



ప్రతిభ కనబరిచిన చిన్నారులతో గ్రంథాలయ సిబ్బంది

కడప కల్చరల్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని 40 రోజులపాటు నిర్వహించామన్నారు. క్యాంపులో యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, మోటివేషన్ క్లాస్, ఇండోర్ గేమ్స్, బేసిక్ మాథ్స్, క్యూబ్ గేమ్, డాన్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. తమకు అన్ని విధాల సహకరించిన రీసోర్స్ పర్సన్లు, జేవీవీ నాయకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. రిసోర్స్ పర్సన్ భారతి, డిప్యూటీ లైబ్రేరియన్లు పవన్ కుమార్, జేమ్స్, సురేష్ పాల్గొన్నారు.

మానవతను చాటుకున్న దాతలు



ఆర్థికసాయం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తమవంతు సహాయ సహకారాలను నిరంతరం నిర్వహిస్తూనే ఉంది. ఇందులో భాగంగా శుక్రవారం నగరంలోని మానవత సంస్థ వైద్య విద్య నాల్గవ ఏడాది చదువుతున్న మాధవరానికి చెందిన శామల సుబ్రమణ్యం, ఆయన కుమార్తె లక్ష్మిప్రసన్నకు పుస్తకాలు కొనుగోలుకు అవసరమైన రూ. 10 వేలు అందజేసినట్లు సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి, అవటాల రామాంజనేయులు, నగర కార్యదర్శి బీవీ సుబ్బరాయుడు తెలిపారు.

– అలాగే చిన్నచౌకులోని శ్రీ చైతన్య హైస్కూలు శాఖలో మానవత సంస్థ కార్యక్రమాలు, లక్ష్యాలు, సేవా కార్యక్రమాల గురించి సంస్థ ప్రతినిధులు జిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్ రాటాల గోపి పాఠశాల ప్రతినిధులకు వివరించారు.

– మానవత సంస్థ సభ్యులు చెన్న మధుసూదన్‌రావు కాలికి ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతుండగా ఆయన సతీమణికి వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. జాయింట్ సెక్రటరీ అవ్వారు సుబ్బయ్య, కార్యనిర్వాహక సభ్యులు సమ్మెట సత్యనారాయణ, విద్యా కమిటీ డైరెక్టర్ కల్లూరు బాల యల్లారెడ్డి, మాడా బ్రహ్మం, సాంబ శివారెడ్డి, బీవీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగంతో భూసార క్షీణత

చాపాడు : వ్యవసాయంలో అధిక రసాయన ఎరువుల వినియోగం వలన రోజురోజుకు భూ సారం క్షీణిస్తోందని జాతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు తెలిపారు. వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం మండలంలోని చియ్యపాడు, రేపల్లె, గుంతచీపాడు, సోమాపురం, మొర్రాయిపల్లె, పిచ్చపాడు, అల్లాడుపల్లె, లక్ష్మీపేట, పెద్దగురువళూరు గ్రామాలలో రైతులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక రసాయన ఎరువుల వాడకం వలన భూమిలో సారవంతం తగ్గిపోతుందన్నారు. చిరు ధాన్యాల రకాలు, సస్యరక్షణ చర్యలు, మెలైన యాజమాన్య పద్ధతులు, పోషక విలువ గురించి తెలియజేశారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త శ్రీవల్లి వరిలో అనువైన రకాలు, మినుము రకాల వాటి యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ విజయకుమార్ పశు పోషణ, టీకా మందులు, అధిక పాల దిగుబడి నిచ్చే పద్ధతులు గురించి తెలియజేశారు.

రైల్వే అధికారులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో రైల్వే అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్: టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని గమనించి వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేసిన రైల్వే అధికారులను సన్మానించారు. శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్ విఐపి లాంచ్ లో పశ్చిమ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ రమేష్ బాబు ప్రశంసా పత్రాలను చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్లకు, ట్రావెలింగ్ టికెట్ ఇన్‌స్పెక్టర్లకు అందజేశారు. కడప రైల్వే చెకింగ్ స్క్వాడ్ కు చెందిన ట్రావెలింగ్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ద్వారకనాథరెడ్డి, నరసింహారెడ్డి , మహబూబ్ బాషాలతో పాటు టీటీఐలు రాజశేఖర్, హరి కిషోర్ రెడ్డి, రమేష్, రాఘవేంద్ర రెడ్డి, చైతన్య బాబు లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కమర్షియల్ మేనేజర్ ధనుంజయ సింగ్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్న వారికి కడప రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకర్ శ్రద్ధ అభినందనలు తెలిపారు.

రిటైర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎంవీ రంగాచార్యులు ఒక ప్రకటనలో కోరారు. పెన్షనరీ బెనిఫిట్స్, ఇతర పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. గత పీఆర్‌సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కమిటేషన్ రికవరీ తగ్గించాలని కోరారు. తమ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టీఎంబీ బుచ్చిరాజు, ప్రధాన కార్యదర్శి యు. కూర్మారావు, అసోసియేట్ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, నాయకులు డీడీ రామరాజు, టి.శ్రీనివాసరావు, పి.పెంచలయ్య, ఎన్.శ్రీనాథ్ తదితరులు సమావేశమై డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు.

తల్లికి వందనంపై అధికారిక తేదీ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడులో పాఠశాలలు తెరవక ముందే తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ ఇస్తామని ప్రస్తావన చేసి వారం రోజులు కావస్తున్నా ఇంతవరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు అధికారిక అప్డేట్ అందించకపోవడం చాలా బాధాకరం అని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కడప మహానాడులో తల్లికి వందనంపై ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై సంబంధిత విద్యాశాఖ అధికారులకు అధికారిక ముందస్తు అప్డేట్ అందజేసి డేటా సేకరించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనంపై ముందస్తు డేట్ ఫిక్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

